Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

# విదేశీ ప్రయాణం బీమా రక్షణ

**సరదాగానో... వ్యాపార, ఉద్యోగ అవసరాల కోసమో విదేశాల్లో పర్యటిస్తున్న వారి సంఖ్య తక్కువేమీ లేదు. ఏయే దేశాలు తిరగాలి.. ఏయే ప్రదేశాలు చూడాలి.. ఎంత ఖర్చు అవుతుంది.. ఇలా అన్ని విషయాల్లోనూ కచ్చితమైన ప్రణాళిక ఉంటుంది. కానీ, చాలామంది విదేశాల్లో ఎదురయ్యే అనుకోని, అత్యవసర ఖర్చులను తట్టుకునేందుకు వీలుగా ప్రయాణ బీమా పాలసీని తీసుకోవడాన్ని అంతగా పట్టించుకోరు. ప్రయాణ బీమా తీసుకోవడం ద్వారా అనారోగ్య అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడే కాకుండా.. విమానం ఆలస్యం కావడం, వెళ్లిపోవడం, లగేజీ పోవడంలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ పరిహారం లభిస్తుంది.**



**కా**రు కొన్నప్పుడు తప్పనిసరిగా బీమా పాలసీ ఉండాల్సిందే. అలాగే.. విదేశీ ప్రయాణాలు చేస్తున్నప్పుడు. కచ్చితంగా ప్రయాణ బీమా తోడుండాలి. అలాంటి బీమా ఆసరాగా ఉన్నప్పుడే విదేశీ గడ్డపై మానసికంగానూ. ఆర్థికంగానూ ఇబ్బందిపడే పరిస్థితి ఏర్పడదు.

### విదేశీయానం-బీమా

ప్రస్తుతం చాలా బీమా సంస్థలు విదేశాలకు వెళ్లే ప్రయాణికులకు ప్రయాణ బీమా సౌకర్యాన్ని అందిస్తున్నాయి. పూర్తిస్థాయి బీమా పాలసీ తీసుకున్నప్పుడు అనేక అంశాలకు బీమా రక్షణ కల్పిస్తాయి. కొన్నింటిని కేవలం కొన్ని అవసరాల మేరకే తీసుకునే వెసులుబాటు కూడా ఉంది. మీరు వెళ్లే ప్రాంతం. వ్యవధి. అవసరం. వ్యక్తిగతంగా వెళ్తున్నారా? జంటగా వెళ్తున్నారా? అనేదాన్ని బట్టీ ప్రయాణ బీమా పాలసీలు తీసుకోవచ్చు. వీటి ఆధారంగా కుటుంబ. కార్పొరేట్. సీనియర్ సిటిజన్. విద్యార్థి. ఒకసారి ప్రయాణం. అనేకసార్లు ప్రయాణం ఇలా రకరకాల పాలసీలను ఎంచుకోవచ్చు.

### ఎవరికి ఏ అంశాలు

ఆరు నెలల వయసు నుంచి 70 ఏళ్ల వయసు వారి వరకూ.. ఈ పాలసీలు అందుబాటులో ఉంటాయి. తీసుకున్న పాలసీని బట్టి. అందే ప్రయోజనాలు మారుతుంటాయి. అయితే. చాలా పాలసీల్లో ఆసుపత్రి. వైద్య చికిత్స ఖర్చులకు పరిహారం లభిస్తుంది. మీ మొత్తం ప్రయాణ ఖర్చులో 5-8 శాతం వరకూ ప్రయాణ బీమా తీసుకునేందుకు ఖర్చయ్యే అవకాశం ఉంది. జీవన ప్రమాణాల స్థాయి అధికంగా ఉన్న దేశాలు. ప్రమాదాలకు ఎక్కువ అవకాశం ఉండే దేశాలకు వెళ్లే ప్పుడు బీమా మొత్తం అధికంగా ఉండేలా చూసు కోవాలి. మీరు వ్యాపారం నిమిత్తం వెళుతున్నారా? పర్యాటక ప్రాంతాలను చూడటానికి వెళ్తున్నారా? అనేదీ బీమా మొత్తం నిర్ణయించడంలో కీలకమే. సాహస క్రీడల్లాంటి వాటిల్లో పాల్గొనాలనే ఆలోచన ఉన్నప్పుడు.. దానికి సంబంధించిన అనుబంధ పాలసీని తీసుకోవడం మర్చిపోకూడదు. ఇలాంటి వాటికి ప్రీమియం కూడా అధికంగానే ఉంటుంది.

### ఏయే దేశాల్లో

కొన్ని దేశాలు తమ దేశానికి వచ్చే విదేశీ పర్యాటకులకు ప్రయాణ బీమా కచ్చితంగా ఉండాలనే నియమం ఉంది. కొన్ని దేశాలు దీని గురించి పట్టించుకోవడం లేదు. 60 ఏళ్లు దాటినవారు అమెరికా. కెనడా. ఆస్ట్రేలియా వెళ్లాలనుకుంటే కచ్చితంగా ప్రయాణ బీమా ఉండాల్సిందే. వైద్య చికిత్స ఖర్చులు అధికంగా ఉండే యూకే లాంటి దేశాలకు వెళ్తున్నప్పుడు ప్రయాణ బీమా తీసుకోవడం మర్చిపోవద్దు. అయితే. అనారోగ్యం. ప్రమాదాల బారిన పడటంలాంటి సంఘటనల నేపథ్యంలో ఇప్పుడు చాలా దేశాల్లో ప్రయాణ బీమా పాలసీ తీసుకోవాల్సిందిగా చెబుతున్నాయి.

### ఎంత గడువు?

విదేశీ ప్రయాణ బీమా పాలసీని ఒక రోజు నుంచి ఆరు నెలల వ్యవధి వరకూ తీసుకునే అవకాశం ఉంది. విహార యాత్రలు. వ్యాపార నిమిత్తం వెళ్లేవారు ఒకసారి పూర్తి ప్రయాణానికి వర్తించేలా పాలసీని ఎంపిక చేసుకోవచ్చు. అనేకసార్లు విదేశాలకు వెళ్లొచ్చే వారు ఏడాది వ్యవధికి పాలసీని తీసుకోవచ్చు. ఈ రెండు తరహా పాలసీలూ ప్రయాణంలో ధీమాని ఇచ్చేవే. ఒకసారి పాలసీని ఆరు నెలల కాలానికి తీసుకుంటే.. మరో ఆరు నెలలకు దాన్ని పొడిగించుకునే వీలుంది. అయితే. పాలసీ తీసుకున్న ఆరు నెలల్లోపు ఏదైనా క్లెయిం చేసుకున్నప్పుడు మరోసారి పునరుద్ధరించేందుకు బీమా సంస్థలు అంగీకరించకపోవచ్చు. కాబట్టి. ముందుగానే మీ ప్రయాణానికి తగ్గట్టుగా బీమా పాలసీనీ తీసుకోవడం మేలు.

### గమనించదగ్గ విషయాలు

చాలామటుకు పాలసీలు ముందస్తు వ్యాధుల చికిత్సకు పరిహారం ఇవ్వవు. ముఖ్యంగా హెచ్ఐవీ. మానసిక వ్యాధులకు. విదేశాల్లో క్రిమినల్ చర్యలకు పాల్పడినప్పుడు బీమా పరిహారం దక్కదు. ఉగ్రవాద చర్యల కారణంగా అత్యవసర పరిస్థితులు నెలకొన్నప్పుడు. ఆత్మహత్య చేసుకుంటే పాలసీ పరిహారం ఇవ్వదు. పాలసీ తీసుకునేముందు వేటికి పరిహారం ఇస్తారు? వేటిని మినహాయి స్తారు అనే విషయంలో స్పష్టమైన అవగాహన ఏర్పరచుకోవాలి.

### బీమా ప్రయోజనాలు

- విదేశీ ప్రయాణాల్లో అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చేరితే చికిత్సకు
- అనారోగ్య అత్యవసర పరిస్థితుల్లో భారత్‌కు రావడానికి
- అనుకోని విధంగా మరణిస్తే.. మ తదేహాన్ని తరలించేందుకు
- ప్రమాదవశాత్తూ అయిన గాయాల చికిత్సకు
- ప్రయాణంలో బ్యాగేజీ పోయినప్పుడు
- కొత్త పాస్‌పోర్టు తీసుకునేందుకు అయ్యే ఖర్చు
- అనివార్య కారణాలతో విమానం అందుకోలేని పరిస్థితుల్లో.. వసతి. ఇతర ఖర్చులకు విదేశీ పర్యటనల్లో బీమా తీసుకున్న వ్యక్తి ద్వారా థర్డ్‌పార్టీకి ఏదైనా నష్టం వాటిల్లి. దానికి పరిహారం ఇవ్వాల్సి వచ్చినప్పుడు ప్రయాణ బీమా ద్వారా ఆ పరిహారాన్ని క్లెయిం చేసుకునే అవకాశం కల్పిస్తుంది.

Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org